

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### తెలుగు భాషా దినోత్సవం

ఓ రోజు నా పిల్లలు ఆరు, నాలుగూ తరగతులు చదువుతున్నప్పుడు, మా పెద్దబ్బాయి సీరియస్‌గా నా దగ్గరకొచ్చి "అమ్మా ఆస్తి అంతా నాదే.. తమ్ముడికేం ఇవ్వక్కర్లేదు.. అలా అని వాడిచేత రాయించా చూడు" అన్నాడు.

నేను అది చదివాను. కింద మా క్రిష్ణకాంత్ సంతకం కూడా వుంది. అది చూసి నాకు భోరుమని ఏడవాలనిపించింది. ఎందుకంటే డి.ఏ.వి పబ్లిక్ స్కూల్‌లో వాళ్ళకి నేర్పుతున్న తెలుగుకి.

"అసత...అంతా....అన్నమ్మదే....నకేమోవదుదు.." కింద "కిసనకాంతే"

నాకంటి నీరు చూసి పెద్దవాడు కళవెళ పడ్తూ "ఏడవద్దమ్మా... మళ్ళీ నేను తమ్ముడికి తిరిగి రాసిచ్చేస్తాను" అన్నాడు. అప్పటికింకా ఒక్క ఇల్లుకూడా పూర్తిగా కట్టుకోలేదు మేం.

"ఒద్దురా.. రాయకు" అన్నాను. మళ్ళీ ఆ తెలుగు చూసి తట్టుకోలేక. ఇప్పటికీ ఆ చీటీ నాదగ్గరవుంది. వాళ్ళ పిల్లలకి చూపెట్టడానికి.

ఇంక మా అన్నయ్య పెద్దకొడుకు, ఇప్పుడు ఆర్మీలోకి వెళ్ళి మేజర్ రవిచంద్రగా పిలిపించుకుంటున్నవాడు. ఈనాడు పేపర్ చదువుతూ ఇంటర్ మీడియెట్‌లో "బల్లకట్టు మునిగి ఇరవైనాలుగుమంది భలే పోయారు" అని చదివాడు. "ఛీ అలా వుండివుండదు" అని నేను పేపర్ తీసి చూస్తే "బలైపోయారు" అని వుంది.

చిన్నప్పుడు ఏవీ శామ్యూల్, జెవీ.ఎల్.ఎన్.కే కుమార్, సందానీ ఒకే బెంచ్‌లో కూర్చునేవారు. జెవి.ఎల్.ఎన్.కే వూగిపోతూ "అల్పుడెప్పుడు పల్కు ఆడంబరంగాను.. సజ్జనుండు పల్కు..." అంటూ చెప్తుంటే, ఆ వూగుడొక్కటే నేర్చుకున్న సందానీ

"అల్పుడొక్కడె పల్కు అందంగను..

సజ్జకుండు పకులు సల్లగను...

కాంచనని మోగించినట్లు కనకాన్ని బజాయిస్తవా....

విశ్వం వినురా వినకుంటే నీ కర్మ"

అని తెగ వూగుతూ పద్యాన్ని చెప్పేసి గంట బజాయించగానే రూంలోంచి పరిగెత్తేవాడు. చిన్న తెలుగు పండితుడు నూకల సీతారామయ్యగారు అసలు వీడేం చెప్పాడబ్బా అని ఆలోచిస్తూనే వుండిపోయేవారు.

ఏ.వీ శామ్యూలేమో "అల్పుడొక తరా... సజ్జనుండు ఒక తరా.. కాంచన ఒక తరా, కనక ఒక తరా. ఏ తరాలో సెప్పినా విసుగులేకుంట వినరా వేమా!" అని వూగుతూ చెప్పేసేవాడు.

నూకలగారికి విసుగూ, కోపం ఒక్కసారే వచ్చి "కంచూ కనకం ఎలా మోగాయో కానీ మీ వీపులు విమానం మోత ఎలా మోగుతాయో చూద్దాంరా... శుంఠల్లారా.." అని వేపావారి అమ్మాయితోనో, చింతా వారి అమ్మాయితోనో వాళ్ళ పెళ్ళి చేయించేవారు. ఎంతైనా తెలుగు క్లాస్ మాత్రం రంజుగా వుండేది.

రుక్మిణీ కళ్యాణం గురించి అందుకుంటే, జరాసంధుడూ, రుక్మి, శిశుపాలుడూ... అన్ని కథలూ చెప్పేసేవారు. ద్రౌపదీ పరిణయం గురించి చెప్పాలంటే, ఉలూచీ, చిత్రాంగదా, సుభద్రా అన్ని పరిణయాలూ చెప్పేసేవారు తెలుగు పండిట్. నిద్రలో లేపి అడిగినా కంప్లీట్ వాళ్ళ వంశవృక్షం. క్లాన్ అంతా కంఠోపాఠం అన్నమాట. ఇంద్రుడి ఎక్స్‌ట్రా మేరిటల్ ఎఫైర్స్‌తో సహా.

విలన్స్ లేకపోతే కథ లేదన్న విషయం ఆ వయసులోనే అర్థం అయింది మాకు. రావణాసురుడూ, గజాసురుడూ, జరాసంధుడూ, కంసుడూ టైప్‌లో.

ఇంక ఇప్పటి పిల్లలకి రణబీర్ కపూర్‌కి తాత రాజ్‌కపూర్ అనీ, పెద్దనాన్న పిల్లలు కరీనా కపూర్, కరిష్మా కపూర్‌లనీ, శ్రద్ధాకపూర్ శక్తికపూర్ కూతురనీ, బోనీ కపూర్ అనిల్‌కపూర్‌కి అన్న అనీ, అనిల్‌కపూర్ కూతురు సోనమ్ కపూర్ అనీ, అర్జున్‌కపూర్ తిరిగేది మలైకా అరోరాతో అనీ, ఆమె సల్మాన్‌ఖాన్‌కీ సోహైల్ ఖాన్‌కీ వదినని, అర్బాజ్ ఖాన్‌కి ఆవిడ ఎక్స్ వైఫ్ అనీ.... ఇలాంటి పరిజ్ఞానమే తెలుగు ఇండస్ట్రీ నటులమీద కూడా మన పిల్లలకి ఉంటుంది. చెప్పడం నాకు ఇబ్బంది. నేను ఇండస్ట్రీలో ఉన్నాను కాబట్టి. అంతేకానీ వీళ్ళకి జరాసంధుడూ, మై రావణుడూ, జాంబవంతుడూ, అనిరుద్ధుడూ అవుట్ ఆఫ్ సిలబస్. ఇంగ్లీషు కామిక్స్‌లో లయన్ కింగ్, జంగిల్ బుక్‌లు ఆకర్షించినట్లు ఈ రామాయణాలూ, భారతాలూ పట్టుబడవు.

ఇంక తెలుగు బోర్డులు రాస్తారు కదా.. మెడ మీదకి దారి అంటే మేడ మీదకి దారి. మీ సైకిల్లకి మిరే బద్యులు... ఫంక్మన్ కార్కర్... తెనాలి మినపగుల్లు, రుచి చూసారంటే వదలరు మీ ఆడవాల్లు. ఇచ్చట కల్లు పరీక్ష చేయబడును. మా ఇంటి దగ్గర గుడిమీద ఆజనేయుడి దేవలయం అని రాసారు. ఆకి ...జ కి మధ్య సున్నా లేదు ఎవరినైనా అడిగి రాయించొచ్చుకదా అని మా అబ్బాయితో అంటే వాడు "భక్తి ఆగదమ్మా. ఆ ఉద్రేకంలో ఆగి ఆలోచించాలనిపించదు" అన్నాడు.

ఈ సందర్భంలో వంగూరి చిట్టెన్ రాజుగారు పంపిన ఫోటో, డల్లాస్‌లోని కొప్పెల్ స్కూల్ బోర్డ్‌మీద, అచ్చమైన అక్షరాలతో వున్నది ఎంత ముద్దొచ్చిందో.

"పాఠశాల తలుపులు సాధారణంగానే లాక్ చేయబడతాయి. పాఠశాల సిబ్బంది మిమ్మల్ని లోపలికి అనుమతించేవరకూ వేచి వుండండి. ధన్యవాదాలు."

లాక్ అన్నమాట తప్ప ఆంగ్లపదాలు లేవు. తెలుగువారి విజయానికి ఇంతకన్నా ఏం కావాలి? కానీ మరి మన తెలుగు ఉభయ రాష్ట్రాల్లో పరిస్థితేమిటో మరి మీరే చూడాలి.

తాజాగా నాకు జరిగిన అనుభవం అయితే "ఇంక నేను స్క్రిప్ట్ రాయడానికీ, ముఖ్యంగా డైలాగ్ రాయడానికి పనికిరాను" అనేటట్లు నాకు అనిపించింది.

ఒక వెబ్ ఛానెల్‌లో, నేను డైలాగ్ రాసి తీసుకెళ్తే 'అసం..' ఆ మాట వెరీ బిగ్ వర్డ్. కెన్ యూ రైట్ ఇట్ ఇన్ టెల్గూ అని అడిగిందో శుద్ధమైన తెలుగమ్మాయి. అక్కడ ఓ పన్నెండుమంది ఇరవై ఐదునుండి ముప్పై ఐదువరకూ వయసున్న 'యంగ్‌స్టర్స్' ఉద్యోగం చేస్తున్నారు.

"అది అసంతృప్తి.. తెలుగుమాటే కదమ్మా" అన్నాను.

"నో..నో..కాలోక్వియల్‌గా రైట్ చెయ్యాలి మేమ్.. ఇట్స్ ఏ వెబ్ సిరీస్" అంది.

అంతేకాదు "డోంట్ యూజ్ సో మెనీ తెలుగూ వర్డ్స్" అని కూడా అంది. నేను "నాకు దురదృష్టం కొద్దీ కొంచెం తెలుగు వచ్చు.. ఈ దిక్కుమాలిన భాష నాకు రాదు. రాయను" అన్నాను.

"ఫ.." అనే వర్డ్ ప్రతిమాటకి ముందూ వెనుకా వస్తుంది. ఆ దిక్కుమాలిన వెబ్ సిరీస్ మాతృకలో. ఇంక సీన్స్ విషయంలో బెంగాలీలు అందరికన్నా నాలుగు అంగలు ముందున్నారు.

ఈ మధ్య నేషనల్ జ్యూరీలో ఢిల్లీలో ఒక నెలరోజులు, రాజలాంఛనాలతో, సెంట్రల్ గవర్నమెంట్ గెస్ట్‌గా ఢిల్లీలోని 'అశోకా హోటల్' లో వుండి వచ్చాను. తెలుగు సినిమాలు చూసి తోటి జ్యూరీ మెంబర్లు రకరకాలుగా జోక్ చేస్తుంటే సిగ్గుపడ్డాను. ఏది ఏమైనా హోరాహోరీ బాహాబాహీలా పోరాడి ఏడు ఎవార్డులు రాడానికి దోహదపడ్డాను తెలుగుకి. ఓ రకంగా మహానటి నా పరువుని కాపాడింది.

మిగతా భాషల సినిమాల్లో వారి ఆచారవ్యవహారాలూ, కట్టూబొట్టూ, సంప్రదాయాలకి విలువనిచ్చారు. కానీ మన తెలుగు సినిమాలు, భాష తప్ప ఎక్కువ తెలుగుదనం లేకుండా జాగ్రత్తపడ్డారు. రంగస్థలం లాంటి నేటివిటీవున్న సినిమాలో, మహానటి లాంటి బయోపిక్‌లో తప్ప. ఇంక భోజన సమయంలో ఇతరులతో మాట్లాడుతున్నప్పుడు వారికి వారి భాషమీదున్న మక్కువకి ముచ్చటేసింది. చప్పిడి పప్పూ, బోలెడు మిఠాయిలతో నాలుక చప్పబడిపోయివున్నప్పుడు సుందరం శాంతి అనే తెలుగు అభిమాన కౌముది పాఠకుడొచ్చి "అక్కయ్యగారూ ఇవిగోండి" అని ఆవకాయా, గోంగూరా, మెంతి ఆవకాయ సీసాల్లో తెచ్చిస్తే నాకు కొద్దిగా ప్రాణం వచ్చింది.

"ఏదేశమేగినా.. ఏ స్టార్ హోటలైనా గోంగూరకై వెదుకు మన కళ్ళూ.. కదా!"

తెలుగు భాష దుస్థితీ, ఈ వెబ్ సిరీస్ యుగం గురించి మరోసారి చెప్పుకుందాం. మరీ భాషాదినోత్సవం రోజే వద్దు. జై తెలుగుతల్లి.




Post your comments




https://www.youtube.com/watch?v=ERaaX_IuIS4